

ఆత్మహత్య కేసులో నిందితుడు అరెస్టు

ముండ్లమూరు మండలంలో బీటెక్ విద్యార్థిని గూడాల కిరణ్మయి ఆత్మహత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. - 8లో..



రోడ్డు ప్రమాదాలను నివారించాలి

రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
31 /20

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రి చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మహాశివరాత్రిని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

ఒంగోలు: మహాశివరాత్రి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, మాజీమంత్రి శిద్దా రాఘవరావు వేర్వేరు ప్రకటనల్లో ఆకాంక్షించారు. మానవాళిని కాపాడేందుకు శివుడు గరళం మింగిన రోజు, శివపార్వతుల కళ్యాణం జరిగిన మాఘ బహుళ చతుర్దశిని మహాశివరాత్రిగా ఏటా ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని, ఈ సందర్భంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో శివ పార్వతులని పూజించి సకల శుభాలను పొందాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు.

ఏకేయూ వీసీని కలిసిన అధ్యాపకులు



వీసీని సత్కరిస్తున్న డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి తదితరులు

ఒంగోలు: ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా నియమితులైన మారెడ్డి అంజిరెడ్డిని స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఆయన చాంబర్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి, న్యాక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తదితరులు వీసీని ఘనంగా సత్కరించారు. తమ కాలేజీలో ఉన్న కోర్సులు, కాలేజీ వివరాలను ప్రిన్సిపాల్ కళ్యాణి వీసీకి వివరించారు. మరో వైపు అధ్యాపక సంఘం ప్రతినిధులు కూడా వీసీని కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయనను కలిసిన వారిలో ఏపీ విద్యావంతుల వేదిక గౌరవాధ్యక్షులు తాటిపర్తి గోపాల్‌రెడ్డి, ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఉన్నారు. వీసీ మాట్లాడుతూ పేర్నమిట్టలోని యూనివర్సిటీ భవనాలు, స్థలాలను త్వరలో సందర్శిస్తానని, యూనివర్సిటీ అభివృద్ధికి తక్షణ చర్యలు చేపడతామన్నారు. వీసీని కలిసి వారిలో ప్రైవేటు లెక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రవికుమార్, జాన్ శామ్యూల్, పార్థసారథి, సాయి రాజేష్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

కడప ఆర్జేడీపై దాడి హేయం

ఒంగోలు: కడప రీజినల్ జాయింట్ డైరెక్టర్ ప్రతాపరెడ్డిపై గురువారం జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఏదైనా ప్రజాస్వామ్యయుతంగా ఎదుర్కోవాలి తప్ప దాడి చేయడం దుర్మార్గం, పిరికితనంగా పేర్కొన్నారు. ఆర్జేడీగా విద్యాశాఖలో మంచి ఫలితాలు రాబట్టేందుకు మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో సమీక్షించే అధికారం ఉంటుందని, దానిని రాజకీయం చేయడం, అది వద్దని చెప్పడం ప్రభుత్వ వ్యతిరేక చర్యగా భావిస్తున్నామన్నారు. రాష్ట్ర అధికారిపై ఇలాంటి దాడులు హేయమైన చర్య అని, దాడిచేసిన వారిమీద కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డికి వైఎస్సార్‌టీఎఫ్ నైతిక మద్దతు ప్రకటిస్తుందని, ఆయనకు అండగా ఉంటామని ప్రకటించారు.

రిజిస్ట్రేషన్లు ఇక వేగంగా..



స్థిరాస్తి కొనుగోలు ఒక ఎత్తయితే.. దానిని రిజిస్ట్రేషన్ చేసుకోవడం మరో ఎత్తు..అక్కడ డాక్యుమెంట్ రైటర్లు మొదలు దళారులు.. ఇలా దోపిడీ పర్వం మొదలవుతుంది. డాక్యుమెంట్ చేతికి రావాలంటే ఎన్నో వ్యయ ప్రయాసలు..ఇక వీటికి చెక్ పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. పారదర్శకంగా... అవినీతికి తావులేకుండా.. రిజిస్ట్రేషన్లు సులువుగా చేసుకునేలా ప్రత్యేక సేవా కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా జిల్లా కేంద్రం ఒంగోలులో శాఖను ప్రారంభించనుంది.

- గంటల వ్యవధిలోనే డాక్యుమెంట్లు చేతికి
- పారదర్శకంగా... అవినీతికి తావులేకుండా..
- ఒంగోలులో రిజిస్ట్రేషన్ల సేవా కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు
- వచ్చామా..రిజిస్ట్రేషన్ చేయించుకున్నామా.. వెళ్లామా అన్నట్లుగా సేవలు
- రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఏర్పాటుకు నిర్ణయం
- కార్యాలయం ఏర్పాటుకు భవనాన్ని గుర్తించే పనిలో అధికారులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: స్థిరాస్తి, వివాహ రిజిస్ట్రేషన్లతోపాటు పలు సేవలు మొత్తం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ పరిధిలోకి వస్తాయి. వీటి కోసం రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళితే అదొక పెద్ద తంతు. అక్కడ మొదట కనపడేది డాక్యుమెంట్ రైటర్లు. వీళ్ల వ్యవహారం అంతా...ఇంతా కాదు. రిజిస్ట్రేషన్ శాఖలో పనిచేసే అధికారులనే వీళ్లు భయపెడతారు. అక్రమాలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ఆలోచనకు తెరతీసింది. అదే ప్రీమియం రిజిస్ట్రేషన్ సర్వీస్ సెంటర్స్...అంటే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు అన్న మాట.

వేగంగా రిజిస్ట్రేషన్లు...

రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇక నుంచి వేగం పుంజుకోనుంది. మామూలుగా అయితే రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత డాక్యుమెంట్లు చేతికి రావాలంటే కనీసం రెండు, మూడు రోజుల తంతుగా మారింది. ఈ తంతుకు ఫుల్‌స్టాప్ పెడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సరికొత్త ఆలోచనలు చేసింది. క్రయ, విక్రయదారులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యాలు లేకుండా వేగంగా రిజిస్ట్రేషన్ చేయించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. రిజిస్ట్రేషన్ల శాఖ ఇక నుంచి సేవా కేంద్రాల్లా తయారు కావాలన్నదే లక్ష్యంగా సరికొత్త ఆలోచనలు చేసింది. వచ్చామా...రిజిస్ట్రేషన్ చేయించుకున్నామా... వెళ్లామా అన్నట్లుగానే ఇక నుంచి రిజిస్ట్రేషన్ వ్యవస్థ ఉండాలని నిర్ణయించింది. పారదర్శకంగా అవినీతికి తావులేకుండా స్థిరాస్తి రిజిస్ట్రేషన్ కానీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో ఎలాంటి సర్వీస్ అయినా సులభంగా జరిగిపోయేలా దృష్టిసారించింది.

జిల్లాలోని ఎవరైనా ఈ సర్వీస్ సెంటర్‌లో సేవలు పొందవచ్చు:

రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో మాత్రమే ప్రీమియం రిజిస్ట్రేషన్ సర్వీస్ సెంటర్‌ను ఏర్పాటు చేయటానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా జీఓ ఎంఎస్ నంబర్–23ను విడుదల చేసింది. ఈ మేరకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ టూ ఏపీ గవర్నమెంట్ డాక్టర్ రజత్ భార్గవ్ ఇచ్చిన ఉత్తర్వుల మేరకు సాధారణ రిజిస్ట్రేషన్ కార్యాలయాల మాదిరిగానే ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యాలయం పనిచేస్తుంది. జిల్లాలో మొత్తం 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలోని ఎవరైనా ఈ సెంటర్‌లో రిజిస్ట్రేషన్‌తో పాటు అన్ని రకాల సేవలు పొందవచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే ఇక్కడ గంటల వ్యవధిలోనే డాక్యుమెంట్ కూడా తీసుకోవచ్చు. రోజుల తరబడి తిరిగే శ్రమ లేకుండా ఈ సర్వీస్ సెంటర్ ద్వారా సేవలు పొందేలా రాష్ట్ర ప్రభుత్వం నియమావళిని రూపొందించింది. మధ్యవర్తులు లేకుండా..డాక్యుమెంట్ రైటర్ల ప్రభావం ఈ కార్యాలయ పరిధిలో కనబడకుండా ఉండేలా కార్యాచరణ చేపట్టారు.

సేవా కేంద్రంలో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు:

నూతనంగా ఏర్పాటు చేయనున్న ప్రీమియం రిజిస్ట్రేషన్ సర్వీస్ సెంటర్‌లో కనీసం ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు అందుబాటులో ఉంటారు. ఏడుగురు సహాయకులు సేవలందిస్తారు. ఇద్దరు ఆఫీస్ సబార్డినేట్లు ఉంటారు. ఇద్దరు వాచ్‌మన్లను కూడా ఉంటారు. కార్యాలయానికి వచ్చిన ప్రజలకు, క్రయ, విక్రయదారులకు ఎలాంటి అసౌకర్యాలకు తావులేకుండా చేయటమే ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం ఈ సరికొత్త విధానానికి రూపకల్పన చేసింది. ప్రత్యేకంగా సెక్యూరిటీ గార్డులను కూడా నియమిస్తారు. వచ్చిన వారికి సేవలు అందించటానికి ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల నుంచి కాంట్రాక్టు ఉద్యోగులను కూడా కేటాయించుకునేలా ఏర్పాట్లు చేశారు.

అవినీతికి తావులేకుండా...



రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో అవినీతి తావులేకుండా స్థిరాస్తి రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు వీలు కలుగుతుంది. డాక్యుమెంట్ రైటర్లు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా వేగంగా రిజిస్ట్రేషన్లు చేయించుకొని వెళ్లవచ్చు. ఏ మాత్రం ఆలస్యం లేకుండా గంటల వ్యవధిలోనే పనిపూర్తి చేయించుకొని డాక్యుమెంట్లను అదేరోజు వెంట తీసుకుపోవచ్చు. ప్రకాశం జిల్లాలోని ఏ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని వారైనా నూతనంగా ఏర్పాటు చేయనున్న ప్రీమియం రిజిస్ట్రేషన్ సర్వీస్ సెంటర్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. అందుకోసం ఒంగోలులో 7 వేల నుంచి 10 వేల చదరపు అడుగుల్లోపు ఉన్న భవనాన్ని కార్యాలయం కోసం చూస్తున్నాం. త్వరలో కార్యాలయం ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు అందిస్తాం.

– జి.శ్రీరామ్ కుమార్, జిల్లా రిజిస్ట్రార్, ప్రకాశం

ఉత్సాహంగా..
ఉల్లాసంగా

రాష్ట్ర స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు

గిద్దలూరు రూరల్: మహా శివరాత్రి పండుగ సందర్భంగా పట్టణంలోని పాతాళనాగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో శనివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎడ్ల బండ లాగుడు పోటీలను స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు ప్రారంభించారు. ఈ పోటీల్లో మొత్తం 9 జతల ఎడ్లు పాల్గొన్నాయి. పల్నాడు జిల్లా కేశానిపల్లె గ్రామానికి చెందిన నెల్లూరి రామకోటయ్యకు చెందిన ఎడ్లు 3 వేల అడుగులు బండను లాగి మొదటి బహుమతి రూ.60 వేలను, నంద్యాల జిల్లా బిల్లలాపురం గ్రామానికి చెందిన భూమ గోవర్ధన్‌రెడ్డికి చెందిన ఎడ్లు 2780 అడుగులు లాగి రెండో బహుమతి రూ.50 వేలను, వైఎస్సార్ జిల్లా చౌటుపల్లి గ్రామానికి చెందిన మార్తాల చంద్రఓబులేరెడ్డి ఎడ్లు 2704 అడుగుల దూరంలాగి మూడో బహుమతి రూ.40 వేలను, వైఎస్సార్ జిల్లా అనువారిపల్లెకు చెందిన శీలం జగన్‌మోహన్‌రెడ్డి ఎడ్లు 2612 దూరంలాగి నాల్గవ బహుమతి రూ.30 వేలను, నంద్యాల జిల్లా బేతంచెర్లకు చెందిన మేకల వెంకటరాముడు ఎడ్లు 2384 అడుగుల దూరం లాగి 5వ బహుమతి రూ.20 వేలు, పల్నాడు జిల్లా దాచేపల్లి గ్రామానికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్లు 2009 అడుగుల దూరంలాగి 6వ బహుమతి రూ.10 వేలను దక్కించుకున్నాయి. ఈ ఎడ్ల పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చారు.



ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు



విద్యుత్‌దీప కాంతుల్లో ఒంగోలులోని కొత్తపట్నం బస్టాండులో శివాలయం



ఒంగోలు సంతపేట సాయిబాబా ఆలయంలోని శివాలయంలో రుద్రాక్షల పందిరి



త్రిపురాంతకంలో త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయం వద్ద విద్యుత్‌దీపాలంకరణ

శివపూజకు తరుణమిదే..

భక్తసులభుడైన ఆ పరమశివుడు ఆద్యంత రహితమైన లింగరూపంలో ఉద్భవించిన పరమ పవిత్రమైన మహాశివరాత్రి పర్వదినానికి జిల్లాలోని శైవక్షేత్రాలన్నీ ముస్తాబయ్యాయి. వేలాదిగా తరలివచ్చే భక్తజన సందోహానికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయాల నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తుల రద్దీకి తగినట్లుగా క్యూలైన్లు, బారికేడ్లను ఏర్పాటు చేశారు. పలుచోట్ల శివకల్యాణం, తిరునాళ్ల కన్నులపండువగా నిర్వహించేందుకు, భక్తులకు అన్నదానానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

- సాక్షి నెట్‌వర్క్



భైరవకోనలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లు



భైరవకోనలో త్రిముఖ దుర్గాంబిక, భైరవేశ్వరస్వామి

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

- మార్చి 13న పోలింగ్, 16న ఓట్ల లెక్కింపు
- మార్చి 21వ తేదీకి ఎన్నికల ప్రక్రియ పూర్తి
- విలేకర్లతో కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లాలో అన్నీ చర్యలు తీసుకుని సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. ప్రకాశం భవనంలో శుక్రవారం ఎస్పీ మలికాగర్గ్‌తో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ నెల 16వ తేదీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిందన్నారు. నామినేషన్ల ఈ నెల 23వ తేదీ వరకు దాఖలు చేసేందుకు సమయం ఉందన్నారు. 24వ తేదీ నామినేషన్ల పరిశీలన, 27న నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉందన్నారు. మార్చి 13వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. మార్చి 16న ఓట్ల లెక్కింపు జరుగుతుందని వివరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం జిల్లాలో పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి 98, ఉపాధ్యాయ నియోజకవర్గంలో 40 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వాటిలో పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి మార్కాపురం డివిజన్‌లో 28, కనిగిరి 24, ఒంగోలు డివిజన్‌లో 46 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి మార్కాపురం 13, కనిగిరి 13, ఒంగోలు 14 కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లు 55,729 మంది పురుషులు, 26,455 మహిళా ఓటర్లు, ఐదుగురు థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. టీచర్ల నియోజకవర్గంలో 3650 మంది పురుషులు, 2,062 మంది మహిళా ఓటర్లు ఉన్నట్లు వివరించారు. ఎన్నికల నిర్వహణకు 3500 బ్యాలెట్ బాక్స్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. రిటర్నింగ్ అధికారిగా చిత్తూరు జిల్లా కలెక్టర్ ఉన్నారని, జిల్లా డీఆర్‌ఓ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. జిల్లాలో మొత్తం ఎన్నికల ప్రవర్తనా నియమావళి పర్యవేక్షణ బాధ్యతలు జాయింట్ కలెక్టర్‌కు అప్పగించినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ బందోబస్తు పర్యవేక్షిస్తారన్నారు. వీరితో పాటు 20 రకాల బాధ్యతల నిర్వహణ కోసం సీనియర్ అధికారులను నోడల్ అధికారులగా నియమించామన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్పీ మలికాగర్గ్

ప్రత్యేక పరిశీలన బృందాల ఏర్పాటు:

మండలాల వారీగా ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించామని కలెక్టర్ చెప్పారు. కలెక్టరేట్‌లో 24 గంటలు అందుబాటులో ఉండేలా ఈ నెల 9వ తేదీ నుంచి 1077, 1950 నంబర్‌లతో ప్రత్యేక కంట్రోల్ రూము ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రచారం కోసం అభ్యర్థులు చేసే ఖర్చును పరిశీలించేందుకు 3 డివిజన్‌లలో, జిల్లా కేంద్రంలోను ప్రత్యేక ఆడిట్ బృందాలు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థుల ఎన్నికల ప్రచార వీడియోలు పరిశీలించేందుకు ప్రత్యేక బృందాలు నియమించామన్నారు. ఎన్నికల సామగ్రి స్వీకరణ, తరలింపునకు ప్రత్యేక రిసెప్షన్ ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల నిర్వహణలో 213 మంది ప్రిసైడింగ్ అధికారులు, 201 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 170 మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులను మైక్రో అబ్జర్వర్లుగా, 22 మందిని సెక్టార్ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. వీరందరికీ ఈ నెల 22 నుంచి మార్చి 6వ తేదీ వరకు క్యాటగిరీ వారీగా శిక్షణ ఇస్తున్నామన్నారు. ఎన్నికల సామగ్రిని, సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు 32 వాహనాలు, బ్యాలెట్ బాక్స్‌లు చిత్తూరులోని స్ట్రాంగ్ రూముకు తరలించేందుకు 6 డీజీటీ వాహనాలను సిద్ధం చేశామన్నారు.

44 కేంద్రాలు సమస్యాత్మకం:

ఎస్పీ మలికాగర్గ్ మాట్లాడుతూ జిల్లాలో 15 పోలింగ్ లొకేషన్‌లలో 44 కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించామన్నారు. ఆయా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రత ఉంటుందన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి కచ్చితంగా అమలు చేసేందుకు 38 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో బృందంలో ఒక తహశీల్దారు, ఎస్‌హెచ్‌ఓ, పోలీసు సిబ్బంది ఉంటారన్నారు. నోటిఫికేషన్ జారీ అయినందున అభ్యర్థులు, కార్యకర్తలు సమావేశాలు, ర్యాలీలు, ప్రచారాలకు ముందస్తు అనుమతులు పొందాలన్నారు.

'కాఫీ విత్ కలెక్టర్' పరిశీలించిన కేంద్ర బృందం



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ, కేంద్ర పరిశీలకులు

ఒంగోలు అర్బన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకునేలా ప్రోత్సహిస్తూ వారిలో స్ఫూర్తిని నింపేలా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ చేపట్టిన కాఫీ విత్ కలెక్టర్ కార్యక్రమాన్ని కేంద్ర పరిశీలన బృందం శుక్రవారం స్వయంగా పరిశీలించింది. దీనిలో ఎస్పీ మలికా గర్గ్ కూడా పాల్గొన్నారు. విద్యార్థులు లక్ష్యాలు సాధించేలా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్స్, కళాశాలల్లో ప్రతి శుక్రవారం కెరీర్ గైడెన్స్ పేరుతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో వినూత్న కార్యక్రమాల అమలు కేటగిరీలో ప్రధాన మంత్రి అవార్డుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం గత నెలలో ప్రతిపాదనలు కోరగా జిల్లాలో చేపడుతున్న ఈ కార్యక్రమంపై మార్గదర్శిని పేరుతో కలెక్టర్ ప్రతిపాదనలు పంపారు. దీంతో ప్రత్యక్షంగా అధ్యయనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వ వ్యయ విభాగం డైరెక్టర్‌లు ఆర్‌కే తాలుక్‌దార్, ఆహార, పౌర సరఫరాల శాఖ డిప్యూటీ సెక్రటరీ సీతారామ్ మీనా జిల్లాకు వచ్చి కార్యక్రమాన్ని నేరుగా పరిశీలించారు. ఈ నేపథ్యంలో గురువారం చీమకుర్తిలోని గురుకులం, పొదిలిలోని గవర్నమెంట్ జూనియర్ కాలేజి, ఒంగోలులోని బాలికల హాస్టల్, శుక్రవారం బిట్రగుంటలోని కేజీబీవీ, జరుగుమల్లిలోని జిల్లా పరిషత్ హైస్కూలును సందర్శించారు. కార్యక్రమం అమలుపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, కెరీర్ గైడెన్స్ మెంటార్‌లతో ప్రత్యేకంగా చర్చించారు. అనంతరం సాయంత్రం కలెక్టర్ బంగళాలో నిర్వహించిన కార్యక్రమంలో పరిశీలకులు ప్రత్యక్షంగా పాల్గొని వీక్షించారు. దీనిలో పొదిలి ప్రభుత్వ జూనియర్ కాలేజి, కనిగిరి మండలం కొత్త ఏరువారిపల్లి జెడ్పీ హైస్కూలు, ముండ్లమూరు ఏపీ మోడల్ స్కూల్, ఎస్ఎన్‌పాడు ఏపీ రెసిడెన్షియల్ స్కూల్, కొత్తపట్నం కేజీబీవీ విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రాక్టర్-లారీ ఢీ

● ట్రాక్టర్ డ్రైవర్ కం ఓనర్ మృతి



మృతిచెందిన రామచంద్రుడు

మార్కాపురం: ట్రాక్టర్-లారీ ఢీకొని ట్రాక్టర్ డ్రైవర్ కం ఓనర్ మృతిచెందిన సంఘటన శుక్రవారం వేకువజామున మార్కాపురం మండలం తిప్పాయపాలెంలో చోటుచేసుకుంది. మార్కాపురం రూరల్ ఎస్సై సుమన్ తెలిపిన వివరాల ప్రకారం.. కడప జిల్లా దువ్వూరు మండలం మాచనపల్లి గ్రామానికి చెందిన దిద్దికుంట రామచంద్రుడు (47) తెలంగాణలో ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. రిజిస్ట్రేషన్‌ను ఏపీలో తన పేరుమీద మార్చుకునేందుకు గురువారం ట్రాక్టర్ తీసుకుని తెలంగాణలోని కోదాడ వెళ్లాడు. అక్కడ పనిచూసుకుని స్వగ్రామం బయలుదేరాడు. శుక్రవారం వేకువజామున 3 గంటల సమయంలో మార్కాపురం మండలం తిప్పాయపాలెం గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ వద్దకు రాగానే.. బళ్లారి నుంచి తాడేపల్లిగూడేనికి చింతపండు లోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా రాంగ్ రూట్‌లో వచ్చి ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. దీంతో రామచంద్రుడు రోడ్డుపక్కనే పడి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుమన్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతిచెందిన ఎల్లయ్య

గిద్దలూరు రూరల్: ట్రాక్టర్ బోల్తా పడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన గిద్దలూరు మండలంలోని దిగువమెట్ట గ్రామ సమీపంలో నల్లమల ఘాట్ రోడ్డులో శుక్రవారం జరిగింది. గాజులపల్లెకు చెందిన పసుల ఎల్లయ్య (40) గాజులపల్లె నుంచి సిమెంట్ లోడుతో ట్రాక్టర్ నడుపుకుంటూ గిద్దలూరు వైపు వెళ్తుండగా ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఎల్లయ్య మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు.. సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

దేవధరణి హత్య కేసులో మరొకరు అరెస్టు

పొదిలి రూరల్: తాడివారిపల్లి ఘాట్ రోడ్డులో నంద్యాల జిల్లా పెద్ద ఎమ్మనూరుకు చెందిన యువకుడు దేవధరణి హత్య కేసు నిందితుల్లో ఒకరైన యువతిని శుక్రవారం అరెస్టు చేసినట్లు పొదిలి సీఐ సుధాకర్‌రావు తెలిపారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం అహోబిలం గ్రామానికి చెందిన కొమరపల్లి ఈశ్వరమ్మ అలియాస్ ఆచారమ్మ అలియాస్ స్వప్నను శుక్రవారం మహానంది మండలం గాజులపల్లి బస్టాండ్ వద్ద అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ పేర్కొన్నారు.

జాతీయ విపత్తులపై త్వరలో మాక్ డ్రిల్

ఒంగోలు అర్బన్: జాతీయ విపత్తులపై మాక్ డ్రిల్ నిర్వహించి ప్రజలను చైతన్యపరచడంతో పాటు స్టేక్‌హోల్డర్స్‌ను ప్రభావవంతులుగా చేయాలని జేసీ అభిషిక్త్ కిషోర్ సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం ప్రకాశం భవనంలో డిస్ట్రిక్ట్ క్రైసెస్ గ్రూప్ సమావేశం నిర్వహించారు. ఆఫీస్ సైట్ ఎమర్జెన్సీ మాక్ డ్రిల్ గురించి జాయింట్ కలెక్టర్‌కు డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వివరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ త్వరలో మాక్ డ్రిల్ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అందుకోసం పోలీసు శాఖ, ఆర్డీఓ సహకారం తీసుకోవాలని సూచించారు. మాక్ డ్రిల్‌లో జిల్లా క్రైసెస్ గ్రూప్ సభ్యులంతా తప్పనిసరిగా పాల్గొనాలని స్పష్టం చేశారు. ఆర్డీఓ, స్థానిక తహసీల్దార్, ఈఆర్‌ఓ, ఎస్‌హెచ్‌ఓను భాగస్వాములు చేయాలన్నారు.

21న మాతృభాషా దినోత్సవం

ఒంగోలు: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 21న నగరంలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకాశం జిల్లా రచయితల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నూనె అంకమ్మరావు, కుర్రాప్రసాద్‌బాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముందుగా తెలుగు తల్లి, శ్రీకృష్ణదేవరాయులు, అన్నమయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి అలంకరిస్తారని, అనంతరం స్థానిక నారాయణ పబ్లిక్ స్కూలులో సాయంత్రం 3 గంటలకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ, తెలుగుభాషకు తమ వంతు కృషిచేస్తున్న నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి, గుంటూరు సత్యన్నారాయణలను సత్కరిస్తారన్నారు. జిల్లాలోని కవులు, రచయితలు మిక్కిలిగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

శివనామస్మరణకు వేళాయే..

- నేడు మహాశివరాత్రి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- భారీగా తరలివచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించిన అధికారులు
- త్రిపురాంతకం, భైరవకోనలో ప్రత్యేక వసతులు



శివరాత్రి సందర్భంగా త్రిపురాంతకంలో చేసిన ఏర్పాట్లు



భైరవకోన ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఎండ తగలకుండా వేసిన టెంట్లు



భైరవకోనలో వాహనాల పార్కింగ్ వద్ద ఏర్పాటు చేసిన మొబైల్ టాయిలెట్లు

త్రిపురాంతకం/సీఎస్‌పురం: శివనామస్మరణకు వేళయింది. నేడు మహాశివరాత్రి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకునేందుకు ప్రజలు సన్నద్ధమయ్యారు. అదేస్థాయిలో ఆలయాల్లో ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. జిల్లావ్యాప్తంగా ఉన్న శైవక్షేత్రాలకు భారీగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. ప్రముఖ ఆలయాలైన త్రిపురాంతకంలోని శ్రీపార్వతీ సమేత త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయం, సీఎస్ పురం మండలంలోని భైరవకోనలో ప్రముఖ పర్యాటక శైవక్షేత్రమైన శ్రీభైరవేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తనున్న నేపథ్యంలో ఆయా ఆలయాల వద్ద ప్రత్యేక వసతులు సమకూర్చారు. త్రిపురాంతకంలోని ఆలయంలో గురువారమే మహాశివరాత్రి మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ వైభవంగా ఉత్సవాలు జరుగుతున్నాయి. శుక్రవారం భక్తులచే విశేష పూజలు జరిగాయి. స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. నేడు మహాశివరాత్రి సందర్భంగా మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, లింగోద్భవ దర్శనం, స్వామివారు, అమ్మవార్ల కల్యాణ మహోత్సవం, ఆలయ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈఓ చెన్నకేశవరెడ్డి తెలిపారు. భక్తులు వేలాదిగా తరలిరానున్నందున తగిన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

జాగారం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు...

త్రిపురాంతకంలోని ఆలయాల వద్ద మహాశివరాత్రి సందర్భంగా ఈ ఏడాది వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభ ఏర్పాటు చేశారు. 30 సంవత్సరాల క్రితం త్రిపురాంతకం ఆలయాల వద్ద భారీ విద్యుత్ ప్రభలు దర్శనమిచ్చేవి. ప్రస్తుతం సుదీర్ఘకాలం తర్వాత తిరిగి విద్యుత్ ప్రభ ఏర్పాటు చేసి భక్తుల కోరిక మేరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనుండటం ఆనందంగా ఉందని ట్రస్ట్ బోర్డు చైర్మన్ పద్మజ మల్లికార్జున్ తెలిపారు. పాట కచేరిలు, కోలన్నలు, పౌరాణిక నాటకాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు.

భైరవకోన ముస్తాబు...

మహాశివరాత్రికి భైరవకోన ముస్తాబైంది. ప్రముఖ పర్యాటక శైవక్షేత్రమైన ఇక్కడి శ్రీభైరవేశ్వరస్వామి ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆలయాల సముదాయం వద్ద ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. క్యూలైన్లలో ఉన్న భక్తులకు ఎండ తగలకుండా టెంట్లు వేశారు. జలపాతం వద్ద స్నానాలు చేసేందుకు స్నానఘట్టాలను శుభ్రం చేసి నీటితో నింపి సిద్ధం చేశారు. స్నానాలు చేసిన మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల సౌకర్యార్థం తిరుపతి నుంచి మొబైల్ టాయిలెట్లు తెప్పించి వాహన పార్కింగ్ సమీపంలో ఏర్పాటు చేశారు. వాహనాల పార్కింగ్‌కు, దాతలు తాత్కాలిక అన్నదాన సత్రాలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రత్యేకంగా స్థలాలు కేటాయించారు. వాహనాల పార్కింగ్ స్థలం నుంచి ఆలయం వద్దకు ఉచిత వాహన సౌకర్యం కల్పించనున్నట్లు ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ సిద్దు రమణారెడ్డి, ఆలయ కార్య నిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, సిద్దు వెంకటరెడ్డి తెలిపారు. క్యూలైన్ల వద్ద భక్తులకు ఇబ్బంది కలగకుండా ప్రైవేటు వలంటీర్లను ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. మహాశివరాత్రి సందర్భంగా శనివారం భైరవకోనలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు. వేకువజామున స్వామివారికి రుద్రాభిషేకం, త్రిముఖ దుర్గాదేవి అమ్మవారికి విశేష కుంకుమార్చన, అనంతరం స్వామివారికి రుద్రహోమం, మహా మృత్యుంజయ హోమం, మహా పూర్ణాహుతి, అర్ధరాత్రి లింగోద్భవ కాలమందు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, తదితర పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

గుండ్ల బ్రహ్మేశ్వరానికి భక్తులకు అనుమతి

గిద్దలూరు రూరల్: మహాశివరాత్రి సందర్భంగా నల్లమల అభయారణ్యంలో కొలువుదీరిన గుండ్ల బ్రహ్మేశ్వరస్వామి వద్దకు భక్తులకు అనుమతి ఇస్తున్నట్లు గిద్దలూరు అటవీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా దేవాలయం వద్దకు కేవలం 150 వాహనాలు మాత్రమే అనుమతినిచ్చామన్నారు. సాయంత్రం 4.30 తర్వాత అక్కడి నుంచి వచ్చేందుకు అనుమతి లేదన్నారు. వారికి మరుసటి రోజు ఉదయం 5 గంటలకు పంపించేందుకు అనుమతి ఉంటుందన్నారు. అటవీ ప్రాంతంలో నిప్పు వెలిగించకుండా వెళ్లాల్సి ఉంటుందన్నారు. అటవీ శాఖ అధికారుల నిబంధనల మేరకు స్వామి వారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

● సబ్‌కలెక్టర్ మాధవన్



త్రిపురాంతకం ఆలయాలలో పూజలు చేస్తున్న సబ్ కలెక్టర్

త్రిపురాంతకం: మహాశివరాత్రి మహోత్సవాలు భక్తులకు అసౌకర్యం కలగకుండా వైభవంగా జరిగేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సబ్‌కలెక్టర్ సేతు మాధవన్ పేర్కొన్నారు. త్రిపురాంతకం పార్వతి సమేత త్రిపురాంతకేశ్వర స్వామి, బాలాత్రిపురసుందరీదేవి ఆలయాల వద్ద ఏర్పాట్లు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు ఆయా శాఖల పరిధిలో జరిగిన ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఆలయాల వద్ద జరిగిన ఏర్పాట్లు ఈఓ చెన్నకేశవరెడ్డి వివరించారు. ఆయన వెంట తహసీల్దార్ వి.కిరణ్, సీఐ మీసాల రాంబాబు, ఎంపీడీఓ మరియదాస్, ఆర్ఐ ముకుంద హరి, వీఆర్‌ఓలు శివలింగయ్య, గ్రామసర్పంచ్ పీ వెంకటలక్ష్మి ఉన్నారు. అనంతరం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

బందోబస్తు ఏర్పాట్లు పూర్తి



పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి

త్రిపురాంతకం: త్రిపురాంతకేశ్వర స్వామి, బాలా త్రిపురసుందరీదేవి ఆలయాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఆటంకం లేకుండా బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు దర్శి డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి తెలిపారు. శుక్రవారం త్రిపురాంతకం ఆలయాల వద్ద పోలీస్ సిబ్బందితో డీఎస్పీ సమీక్షించారు. భక్తులకు తగిన సూచనలిస్తూ ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించాలని చెప్పారు. పార్కింగ్‌కు కేటాయించిన స్థలాల్లో వాహనాలు నిలిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ సిబ్బందికి సహకరించాలని భక్తులను కోరారు. సమావేశంలో సీఐలు రాంబాబు, రామకోటయ్య, ఎస్సైలు జీవీ సైదులు, దేవకుమార్, రామకృష్ణ, సైదాబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మెగా సౌత్‌జోన్ క్రికెట్ పోటీలు



విజేత ప్రభుదాస్ లెవెన్స్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి

ఒంగోలు: స్థానిక శర్మా కాలేజీ గ్రౌండులో మెగాస్టార్ చిరంజీవి అభిమానులు నిర్వహించిన మెగా సౌత్ జోన్ క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో ప్రభుదాస్ లెవెన్-జడ లెవెన్స్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ప్రభుదాస్ లెవెన్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 187 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జడ లెవెన్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయి 137 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీంతో ప్రభుదాస్ జట్టు 50 పరుగుల ఆధిక్యంతో విజయకేతనాన్ని ఎగురవేసింది. మూడో బహుమతిని శ్రీకాకుళం జట్టు, నాలుగో బహుమతిని మణి లెవెన్స్ జట్టు అందుకున్నాయి. బహుమతి ప్రదానోత్సవానికి వైఎస్సార్ సీపీ యువ నాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా సౌత్ జోన్ క్రికెట్ పోటీలను ఒంగోలు వేదికగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆర్గనైజర్లు ఇందుర్తి డుంబు, రావూరి బుజ్జి, దాసరి పిచ్చయ్య తదితరులు మాట్లాడుతూ.. పోటీల నిర్వహణకు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ప్రణీత్‌రెడ్డి అందించిన సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో పుసుపులేటి సాయి ప్రవీణ్, రెహమాన్, సీహెచ్ నాగరాజు, బెదాడే, షమీర్, శ్రీకాంత్, మెగా బాలినేని అభిమానులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికాగర్గ్, డీటీసీ కృష్ణవేణి

ఒంగోలు అర్బన్: రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. రహదారి భద్రత, నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. స్థానిక ప్రకాశం భవనంలో శుక్రవారం నిర్వహించిన రహదారి భద్రత కమిటీ సమావేశంలో తొలుత గత నెలలో జరిగిన ప్రమాదాలు, వాటి తీరుపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదాలకు కారణమవుతున్న వాహనదారుల ప్రవర్తనపై షార్ట్‌ఫిల్మ్స్ రూపొందించాలన్నారు. ఇంజినీరింగ్ యూనివర్శిటీ స్థాయి విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు ఇవ్వాలన్నారు. పశువులను రోడ్డు దాటించేందుకు ప్రత్యేక క్రాసింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలన్నారు. పొగమంచుతో ప్రమాదాలు జరగకుండా ముందుగానే పెట్రోలింగ్ వాహనాలు వాతావరణ పరిస్థితులను గమనించి, ఆ విషయాన్ని సమీపంలోని టోల్‌గేట్ల సిబ్బందికి తెలపాలన్నారు. టోల్‌గేట్ల సిబ్బంది వద్ద ప్రత్యేక డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఐ-ర్యాడ్ అప్లికేషన్‌ను పోలీసులు, వైద్యులు, రహదారి అధికారులు సమర్థవంతంగా వినియోగించాలని కలెక్టర్ సూచించారు. రహదారుల వెంట కొత్తగా బస్ షెల్టర్లు నిర్మించేందుకు ప్రత్యేక నమూనాలు తయారు చేయాలన్నారు. రహదారి భద్రతపై పాఠశాలలు, కాలేజీల్లో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఒంగోలులోని ఆటోనగర్‌ను ఆధునికీకరించేందుకు సర్వే చేయాలన్నారు. ఎస్పీ మలికాగర్గ్ మాట్లాడుతూ రహదారి ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రతి శనివారం నో యాక్సిడెంట్ డే నిర్వహించి వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలను వివరిస్తున్నటు తెలిపారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. సరుకులు రవాణా చేసే వాహనాల్లో ప్రయాణికులను ఎక్కిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డీటీసీ కృష్ణవేణి, పశుసంవర్థకశాఖ జేడీ బేబీరాణి, డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, డీసీహెచ్‌ఎస్ మూర్తి, ఆర్టీసీ ఆర్‌ఎం సుధాకర్ పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య కేసులో నిందితుడి అరెస్టు

● వివరాలు వెల్లడించిన దిశ డీఎస్పీ పల్లపురాజు



వివరాలు వెల్లడిస్తున్న దిశ డీఎస్పీ పల్లపురాజు

ముండ్లమూరు: బీటెక్ విద్యార్థిని గూడాల కిరణ్మయి ఆత్మహత్య కేసులో నిందితుడు చింతల వెంకటనారాయణరెడ్డిని శుక్రవారం రాత్రి అరెస్టు చేసినట్లు దిశ డీఎస్పీ ఎ.పల్లపురాజు తెలిపారు. ఎస్సై ఎల్.సంపత్‌కుమార్‌తో కలిసి శుక్రవారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ఉమామహేశ్వరపురం గ్రామానికి చెందిన గూడాల సుబ్బారెడ్డి కుమార్తె కిరణ్మయి విశాఖపట్నంలోని గాయత్రి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. సంక్రాంతి సెలవులకు జనవరి 13న విశాఖపట్నం నుంచి ఇంటికి వచ్చింది. మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అద్దంకి, ఒంగోలు, సికింద్రాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ జనవరి 15వ తేదీన విద్యార్థిని మృతి చెందింది. ఆత్మహత్యకు కారణాలు తెలియకపోవడంతో అదే రోజున ఖననం చేశారు. ఆత్మహత్యకు కారణాలను కనుగొనే ప్రయత్నంలో మృతురాలి సెల్‌ఫోన్‌ను పరిశీలించగా స్వగ్రామానికి చెందిన మల్లికార్జునరెడ్డి నుంచి జనవరి 11వ తేదీ ఫోన్ కాల్ ఉంది. 12వ తేదీన కాలేజీలో చదువుతున్న సీనియర్ వంశీతో మాట్లాడినట్లు ఉంది. దీంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి సుబ్బారెడ్డి, అతని అన్న కుమారుడు అంకిరెడ్డితో కలిసి విశాఖపట్నంలోని కాలేజీకి వెళ్లారు. అక్కడ మృతురాలి స్నేహితులను, రూమ్‌మేట్స్‌ను కలిసి 11వ తేదీ ఏమి జరిగిందని ఆరా తీశారు. అక్కడి వారు చెప్పిన వివరాల ప్రకారం చింతల వెంకటనారాయణరెడ్డి 11వ తేదీ సాయంత్రం నాలుగు గంటల సమయంలో కాలేజీ నుంచి బయటకు రాగానే బలవంతంగా సెల్‌ఫోన్, బంగారపు ఉంగరం లాక్కొని, ఆమెను బలవంతంగా సమీపంలోని ఎస్ఆర్ గెస్ట్ హౌస్‌కి, బక్కన్నపాలెం రూమ్‌కు తీసుకెళ్లి ఆమెకు మద్యం తాగించి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అదే సమయంలో అశ్లీల ఫొటోలు తీశాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే ఫొటోలు అందరికీ చూపిస్తానని కిరణ్మయిని బెదిరించాడు. తన కుమార్తె ఆత్మహత్యకు చింతల వెంకటనారాయణరెడ్డి కారణమని నిర్ధారించుకున్న తండ్రి సుబ్బారెడ్డి ఈనెల 8వ తేదీన స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఎస్సై ఎల్ సంపత్ కుమార్ కేసు నమోదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు దిశ డీఎస్పీ పల్లపురాజు దర్యాప్తు చేపట్టారు. ఈ నెల పదో తేదీన కిరణ్మయి మృతదేహానికి డాక్టర్ల బృందంతో పోస్టుమార్టం నిర్వహించారు. నిందితుడు వెంకటనారాయణరెడ్డిని శుక్రవారం రాత్రి దర్శి-అద్దంకి ప్రధాన రహదారిలో వేంపాడు అడ్డరోడ్డు వద్ద అదుపులోకి తీసుకున్నట్లు దిశ డీఎస్పీ పల్లపురాజు తెలిపారు. నిందితుడి నుంచి ఒక సెల్‌ఫోన్, మృతురాలి ఉంగరాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

శ్రీశైలం ఘాట్‌లో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

మార్కాపురం టౌన్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకున్నట్లు ఆర్డీఓ అమర్‌నాయక్ తెలిపారు. దోర్నాల-త్రిపురాంతకం వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నామని, ఒక్కో తనిఖీ కేంద్రంలో ముగ్గురు ఇన్‌స్పెక్టర్‌లు ఉంటారని చెప్పారు. ఘాట్ రోడ్డులో ఎక్కడైనా వాహనాలు ఆగిపోతే వెంటనే తొలగించేందుకు క్రేన్‌లు కూడా అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఈ నెల 18, 19 తేదీ వరకు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఘాట్ రోడ్డులో ఎదురుగా వెళ్తున్న వాహనాలను ఓవర్ టేక్ చేయవద్దని, దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడితే అందరూ ఇబ్బందులు పడే ప్రమాదం ఉందని ఆర్డీఓ అమర్ నాయక్ హెచ్చరించారు.

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం



మద్దిపాడు: లారీ ఢీకొని యువకుడు దుర్మరణం పాలైన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున జాతీయ రహదారిపై మద్దిపాడు మండలంలోని ఏడుగుండ్లపాడు వద్ద చోటుచేసుకుంది. మద్దిపాడు ఎస్సై శ్రీరామ్ తెలిపిన వివరాల ప్రకారం.. సంతనూతలపాడు మండలం గురవారెడ్డిపాలెం గ్రామానికి చెందిన భీమనాథం కార్తీక్‌రెడ్డి (23) తన ట్రాక్టర్ తీసుకుని టంగుటూరు మండలం ఆలకూరపాడు గ్రామానికి వెళ్లాడు. అక్కడ ట్రాక్టర్‌లో సామాను తీసుకుని తిరుగు ప్రయాణంలో ఏడుగుండ్లపాడు సమీపంలోని పాత నిర్మా కళాశాల వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ట్రాక్టర్‌ను వెనుక వైపు ఢీకొట్టింది. ట్రాక్టర్ నడుపుతున్న కార్తీక్‌రెడ్డి (23) ట్రాక్టర్‌లో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన లారీని వేగంగా ముందుకు తీసుకెళ్లి జాతీయ రహదారి పక్కన ఆపి డ్రైవర్ పారిపోయాడు. లారీ డ్రైవర్‌ను మద్దిపాడు సమీపంలో స్థానిక ఎస్సై పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నెలాఖరులోగా ఈకేవైసీ తప్పనిసరి

ఒంగోలు: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం రిటైర్డ్ ఉద్యోగులు ఈనెలాఖరులోగా ఈకేవైసీ చేయించుకోవాలని ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘురామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. ఈకేవైసీ చేయించుకోని వారి పెన్షన్ నిలిచిపోయే అవకాశం ఉందని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.